
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
మంగళవారం 20 ఫిబ్రవరి 2024



కోడిగుడ్డు మంత్రి చేసిందేమీ లేదు

బినామీల ద్వారా 600 ఎకరాలు అడ్డగోలుగా కబ్జా

- జిల్లాలో అభివృద్ధి శూన్యం
- ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదు
- సొంత నియోజకవర్గంలో ఒక్కరికీ ఉద్యోగం ఇప్పించలేదు
- తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం
- వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలి
- అనకాపల్లి 'శంఖారావం' సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే అనకాపల్లి అభివృద్ధికి ప్రాధాన్యం



వడ్డాది శంఖారావం సభకు హాజరైన తెలుగుదేశం పార్టీ శ్రేణులు



అనకాపల్లి సభలో టీడీపీ నాయకులు, క్రియాశీల కార్యకర్తలు

అనకాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

జిల్లాకు చెందిన కోడిగుడ్డు మంత్రి చేసిన అభివృద్ధి ఏమీ లేదని, అధికారాన్ని అడ్డంపెట్టుకొని బినామీల ద్వారా 600 ఎకరాలు అడ్డగోలుగా కబ్జా చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు.

అనకాపల్లి పట్టణానికి సమీపంలో పూడిమడక రోడ్డులో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన 'శంఖారావం' సభలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి ఉన్నప్పటికీ ఈ ప్రాంత ప్రజలకు, కనీసం సొంత నియోజకవర్గానికి ఎటువంటి ... మిగతా 7వ పేజీలో



అనకాపల్లి సభలో లోకేశ్‌కు బెల్లం దిమ్మను బహూకరిస్తున్న పీలా గోవింద, టీడీపీ నాయకులు



పిడికిలి బిగించిన నారా లోకేశ్



వడ్డాది సభలో లోకేశ్‌కు జ్ఞాపికను అందిస్తున్న బత్తుల తాతయ్యబాబు, రాజు, తదితరులు

పేరులోనే ధర్మం... చేసేదంతా అధర్మం

చోడవరంలో నాడు అభివృద్ధి... నేడు అవినీతి

- ఇక్కడ రోడ్లపై వారం ప్రయాణిస్తే ఆస్పత్రిపాలే!
- గోవాడ షుగర్స్‌ను ఆదుకుంటాం
- రూ.100 కోట్లతో ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తాం
- జనసేన అధినేత పవన్ హామీ మేరకు చెరకు టన్నుకు రూ.3,500 మద్దతు ధర ఇస్తాం
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేసే బాధ్యత తీసుకుంటా
- వడ్డాది 'శంఖారావం' సభలో నారా లోకేశ్

చోడవరం/బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 19: తెలుగుదేశం హయాంలో చోడవరం నియోజకవర్గాన్ని రూ.1,200 కోట్లతో అభివృద్ధి చేస్తే, వైసీపీ పాలనలో స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ అవినీతి అడ్డాగా మార్చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. మండలం లోని వడ్డాదిలో సోమవారం రాత్రి నిర్వహిం చిన 'శంఖారావం' సభలో ఆయన మాట్లాడుతూ, పేరులోనే ధర్మం ఉందని, ఆయన చేసేదంతా అధర్మమేనని ఎమ్మెల్యే ధర్మశ్రీని ఉద్దేశించి విమర్శించారు. ఎమ్మెల్యే సోదరులు సైతం అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఇప్పటికే రూ.50 కోట్లు వెనకేసుకున్నారని ... మిగతా 7వ పేజీలో



రాష్ట్రాభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలు

ఈ రెండింటినీ దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలి

- ఈసారి అధికారంలోకి రావాలనేకూటమిగా వెళుతున్నాం
- కొన్ని త్యాగాలు తప్పవు
- ఎవరికైనా పోటీ చేసే అవకాశం రాకపోతే భవిష్యత్తులో తగిన న్యాయం చేస్తాం
- ఏదైనా ఉంటే నాతోనో, రాజకీయ వ్యవహారాల కమిటీతోనే చర్చించండి
- పార్టీ నేతలతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్
- పర్యటన ముగించుకొని రాజమండ్రికి పయనం



పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలోకి చేరికలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

ఇది చాలా కీలకమైన సమయమని, ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వ్యవహరించాలని పార్టీ నాయకులకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సూచించారు. ఆదివారం రాత్రి విశాఖపట్నం వచ్చిన ఆయన సోమవారం ఉదయం నోవాటెల్ హోటల్‌లో పార్టీ నాయకులు, నియోజకవర్గాల సమన్వయకర్తలతో విడివిడిగా మాట్లాడారు. ఈసారి అధికారంలోకి రావాలనే ధ్యేయంతో కూటమిగా కలిసి వెళుతున్నామని, ఈ నేపథ్యంలో కొన్ని త్యాగాలు తప్పవని సూచనప్రాయంగా చెప్పారు. ఎక్కడైనా ఎవరికైనా పోటీ చేసే అవకాశం రాకపోతే...భవిష్యత్తులో వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అసంతృప్తితోనో, వేరే విధంగానో పార్టీ గురించి ఎక్కడా బయట మాట్లాడవద్దని సూచించారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది ఇంకా నిర్ణయం కాలేదని స్పష్టంచేశారు. ఎవరికైనా అనుమానాలు, అసంతృప్తి ఉంటే వాటిని బయట మాట్లాడవద్దని, నేరుగా తన దృష్టికే తీసుకురావాలన్నారు. తాను అందుబాటులో లేని పక్షంలో రాజకీయ వ్యవహారాల కమిటీ ఉందని, వారితో చర్చించాలని సూచించారు. అంతే తప్ప పార్టీకి నష్టం జరిగేలా వ్యవహరించవద్దని కోరారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశం ముగిసిన తరువాత విశాఖ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పలువురిని జనసేన పార్టీలో చేర్పించారు. ఈ కార్యక్రమాలన్నీ ముగిసిన తరువాత పవన్‌కళ్యాణ్ ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం వెళ్లిపోయారు.

పేర్లు ఖరారయ్యారంటూ ఊహాగానాలు

పార్టీ అధినేతతో పలువురు సమావేశమైన సందర్భంగా కొందరికి స్పష్టమైన భరోసా లభించిందని, వారికి పోటీ చేసే అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారంటూ సోషల్ మీడియాలో కొందరి పేర్లు షికారు చేశాయి. విశాఖ జిల్లాలో ఇద్దరికి, అనకాపల్లి జిల్లాలో ఇద్దరికి ఫలానా స్థానాలు అంటూ ప్రచారం చేశారు. అయితే ఎవరి పేర్లు ఖరారు చేయలేదని, ఆ ఊహాగానాలు నమ్మవద్దని పార్టీ నాయకులు పలువురు స్పష్టంచేశారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా..

రవాణా, సమాచార వ్యవస్థల మెరుగుకు కృషి

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు

నూతన కలెక్టర్ ఎం.విజయసునీత



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.విజయసునీత

పాడేరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని నూతన కలెక్టర్ ఎం.విజయసునీత తెలిపారు. సోమవారం ఆమె కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన జిల్లాకు మహిళా కలెక్టర్‌గా అవకాశం కలగడం అదృష్టంగా భావించి ప్రజలకు సేవలందిస్తానన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన నేలపై కలెక్టర్‌గా పని చేసే భాగ్యం దక్కడం గర్వంగా భావిస్తున్నానని, అదే బాధ్యతతో ప్రజలకు చేరువగా ఉంటానన్నారు. అర్హులైన అందరికీ ప్రభుత్వం పథకాలను అందించి, వారి జీవన ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలో స్థితిగతులపై లోతుగా అధ్యయనం చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటానన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖపై పట్టు సాధించి, ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారుల ద్వారా సేవలు ప్రజలకు పక్కాగా అందేలా చూస్తామన్నారు. 2009లో సాధారణ ఎన్నికలు నిర్వహించిన అనుభవం వున్నదని, ఆ అవగాహనతో రానున్న ఎన్నికలను నిర్వహిస్తానని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఇతర జిల్లాలతో పోల్చితే ఈ జిల్లా విభిన్నంగా ఉంటుందని, అందువల్ల ఈ జిల్లాకు అనుగుణంగానే అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన ప్రణాళికలను ప్రత్యేకంగా రూపొందిస్తానన్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతాలు అధికంగా ఉన్నందున రవాణా, సమాచార వ్యవస్థలను మరింతగా మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తానని కలెక్టర్ తెలిపారు.



కలెక్టర్ విజయసునీతకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

మోదకొండమ్మ సన్నిధిలో..

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ముందే ఎం.విజయసునీత స్థానిక మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ ప్రధానార్చకుడు సుబ్రహ్మణ్యం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో అమ్మవారిని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆమెకు మోదకొండమ్మ చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించి సత్కరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెకు జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ విజయసునీతతో ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేకంగా భేటీ నిర్వహించి, ఐటీడీఏ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, గిరిజన ప్రాంతంలోని స్థితిగతులను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రోడ్డా.. నల్ల కార్పెట్టా?

తాడేపల్లి- రంప రహదారి నిర్మాణం ఘోరం

పెచ్చులుగా ఊడిపోతున్న వైనం

కొరవడిన ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ

8



తాడేపల్లి-రంప మధ్య చేపడుతున్న రోడ్డు పనులు



పెచ్చులు ఊడిపోతున్న దృశ్యం

21 నుంచి బీజేపీ పోరుబాట

పాడేరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు బీజేపీ పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కొక్కటి చొప్పున మూడు ప్రచార రథాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండిస్తూ ర్యాలీ



రాప్తాడు 'సిద్ధం' సభలో 'ఆంధ్రజ్యోతి' అనంతపురం స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చింతపల్లిలో జర్నలిస్టులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో విలేకరులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.


శంఖారావం సభలు సక్సెస్



లోకేశ్‌కు ఎన్టీఆర్ ప్రతిమ అందజేస్తున్న బుద్ద నాగజగదీశ్



అనకాపల్లి నియోజకవర్గ పరిధిలోని నాగులాపల్లి రోడ్డులో నిర్వహించిన సభలో ప్రసంగిస్తున్న నారా లోకేశ్



అనకాపల్లి సభలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ...కోడిగుడ్డును చూపిస్తున్న నారా లోకేశ్

అనకాపల్లి జిల్లాలో శంఖారావం సభలు సోమవారం విజయవంతమయ్యాయి. అనకాపల్లి నియోజకవర్గ పరిధిలోని నాగులాపల్లి రోడ్డులో నిర్వహించిన సభకు, అలాగే బుచ్చెయ్యపేట మండలం వడ్డాది జంక్షన్‌లో నిర్వహించిన సభకు జనం పోటెత్తారు. టీడీపీ శ్రేణులను ఉత్సాహపరుస్తూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. జగన్ పాలనలో రాష్ట్రం ఎంతగా వెనుకబడిపోయిందో వివరించారు. లోకేశ్ ప్రసంగానికి పార్టీ శ్రేణులు, అభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రతి కార్యకర్త విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. త్వరలో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని, టీడీపీ- జనసేన ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమని ఆయన చెప్పారు.



తాతయ్యబాబు, జనసేన నేత పీవీఎస్ఎన్ రాజుతో..



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం



నాగులాపల్లి రోడ్డులో నిర్వహించిన సభకు హాజరైన జనం



బుచ్చెయ్యపేట మండలంలో పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న లోకేశ్



లోకేశ్‌కు శాలువా కప్పి సత్కరిస్తున్న జనసేన నేత పంచకర్ల రమేశ్‌బాబు



లోకేశ్‌కు నూకాలమ్మ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దాడి రత్నాకర్ తదితరులు



వడ్డాదిలో అభిమానులతో కరచాలనం చేస్తున్న దృశ్యం



కార్యకర్తలతో సమావేశమైన లోకేశ్



బుచ్చెయ్యపేట మండలం వడ్డాది జంక్షన్‌లో నిర్వహించిన సభలో టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



లోకేశ్‌కు బహూకరించిన కత్తి, డాలు

క్రైం... crime news

పోలీసుల అదుపులో నల్లబిల్లి గిరిజనుడు?

కొయ్యూరు, ఫిబ్రవరి 19: మండలంలోని బూదరాళ్ల పంచాయతీ నల్లబిల్లి గ్రామానికి చెందిన సీదరి రామారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఆదివారం రాజేంద్రపాలెం వారపు సంతకు వచ్చిన రామారావును పోలీసులు వలపన్ని తీసుకు వెళ్లినట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న అతని భార్య లక్ష్మి సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చి తన భర్త ఆచూకీ కోసం సంప్రదించింది. అదే సమయంలో కొయ్యూరు మండల పర్యటనకు విచ్చేసిన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి న్యాయం చేయాలని వేడుకుంది. దీంతో చింతపల్లి అదనపు ఎ స్పీని ఎమ్మెల్యే ఫోన్‌లో సంప్రదించగా, విషయం తన దృష్టిలో లేదని, రామారావును ఎవరు తీసుకు వెళ్లారో తెలుసుకుంటానని తెలిపినట్టు సమాచారం. ఇదిలా ఉండగా రామారావు మావోయిస్టు సానుభూతిపరుడిగా జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చినట్టుగా తెలిసింది. రామారావును పోలీసులే తీసుకు వెళ్లారని, అతని ఆచూకీ తెలపాలని భార్య లక్ష్మి వేడుకుంటున్నది.

వైసీపీ నేతలు బరితెగింపు

- ఇసుక అమ్మకాలు, మద్యం బెల్టు షాపునకు వేలంపాట
- ఏకంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే నిర్వహణ
- ఇసుక రూ.66 వేలు, బెల్టు షాపు రూ.40 వేలకు ఖరారు



ఇసుక, మద్యం బెల్టు షాపు వేలంపై శనివారం దండోరా వేస్తున్న దృశ్యం

కశింకోట, ఫిబ్రవరి 19: అధికార పార్టీ నాయకులు మరోసారి బరితెగించారు. శారదా నదిలో ఇసుక అమ్మకాలు, మద్యం బెల్టు షాపు నిర్వహణకు వేలంపాట నిర్వహించారు. పైగా ఈ ప్రక్రియను ఏకంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే చేపట్టారు. వెదురుపర్తి గ్రామంలో జరిగిన ఈ వ్యవహారానికి సంబంధించి స్థానికులు, టీడీపీ నాయకులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండల కేంద్రమైన కశింకోట సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో శారదా నది ఒడ్డున వెదురుపర్తి గ్రామం వుంది. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం అంతగా లేకపోవడంతో ఇసుక తవ్వకాలకు అనుకూలంగా వుంది. అదే విధంగా గ్రామంలో మద్యం దుకాణం లేకపోవడంతో కొంతమంది వ్యక్తులు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారు. దీంతో ఈ రెండు వనరులపై అధికార పార్టీ నేతల కన్ను పడింది. నదిలో ఇసుక తవ్వకాలు/ అమ్మకం, మద్యం బెల్టు షాపు నిర్వహణకు వేలం పాట (అనధికారికంగా) నిర్వహించనున్నట్టు శనివారం రాత్రి గ్రామంలో దండోరా వేయించారు. ఆదివారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఇసుక పాట రూ.66 వేలు, బెల్టు షాపుల పాట రూ.40 వేలకు పాడుకున్నట్టు తెలిసింది. కాగా పంచాయతీ కార్యాలయంలో అనధికార వేలం పాటపై కార్యదర్శి డి.ఆనందరావును వివరణ కోరగా, కింది స్థాయి సిబ్బందితో స్థానిక వైసీపీ నాయకులు పంచాయతీ కార్యాలయం తాళాలు తీయించి వేలం పాట నిర్వహించిన విషయం తన దృష్టికి రావడంతో సిబ్బందిని హెచ్చరించానని చెప్పారు. ఇకపై అలా జరగకుండా చూస్తామని తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	118.00
లైవ్ ధర	138.00
విత్ స్కిన్	246.00
స్కిన్ లెస్	256.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

కోడిగుడ్డు మంత్రి చేసిందేమీ లేదు

... 5వ పేజీ తరువాయి

ప్రయోజనం లేదని, అభివృద్ధి చేయలేని ఇటువంటి నేతలు మనకు అవసరమా?..అని ప్రశ్నించారు. కోడిగుడ్డు మంత్రి కశింకోట మండలంలో 600 ఎకరాలు కొట్టేశారని, మంత్రి గుడివాడ అమర్‌కు బహుమతిగా కోడిగుడ్డును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ ద్వారా పంపుతున్నానంటూ కోడిగుడ్డును చూపించారు. మంత్రిగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలో ఒక్కరికి కూడా ఉద్యోగం ఇప్పించలేదని, కనీసం ఒక్క పరిశ్రమ కూడా తేలేదని లోకేశ్ మర్శించారు. మంత్రితోపాటు వైసీపీ నాయకులకు గంజాయి వ్యాపారంతో సంబంధాలు వున్నాయని ఆరోపించారు. మంత్రి అనుచరులు గ్రావెల్ దందాకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారని, ల్యాండ్ పూలింగ్‌ను బూచీగా చూపించి, రైతుల నుంచి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకొంటున్నారని ఆరోపించారు. ఆర్ఈసీఎస్‌ను చంపేసిన ఘనత మంత్రి అమర్‌కే దక్కుతుందన్నారు.

అనకాపల్లి అభివృద్ధికి ప్రాధాన్యం

టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని లోకేశ్ వెల్లడించారు. వైసీపీ పాలకులు మూసివేయించిన తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి చెరకు రైతులకు న్యాయం చేస్తామన్నారు. బెల్లం రైతులు అంటే వైసీపీకి చిన్నచూపని, నాసిరకం మద్యం అమ్ముకోడానికి నల్ల బెల్లం కొనుగోలు చేసే వ్యాపారులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నదని ఆరోపించారు.

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తారంటూ వైసీపీ పాలకులు వలంటీర్ల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని లోకేశ్ విమర్శించారు. దేశంలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్.టి.రామారావుదేనన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. వైనాట్ 175 అంటున్న వైసీపీ నాయకులు వైనాట్ విశాఖ స్టీల్‌ప్లాంట్, వైనాట్ పోలవరం, వైనాట్ జాబ్ క్యాలండర్...వీటికి సమాధానం చెప్పాలని లోకేశ్ డిమాండ్ చేశారు.

కరెంట్ చార్జీలు తొమ్మిదిసార్లు పెంచారు

జగన్ పాలనలో రాష్ట్రంలో తొమ్మిదిసార్లు కరెంట్ చార్జీలు పెంచారని లోకేశ్ అన్నారు. ఇంటి పన్ను, చెత్తపన్ను, ఆర్టీసీ చార్జీలు, డీజిల్, పెట్రోల్ రేట్లతోపాటు నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచేశారన్నారు. వలంటీర్లు మీ ఇళ్లకు వచ్చి గొట్టాం పెట్టి గాలి పీల్చమంటే పీల్చవద్దని, ఎందుకంటే పీల్చే గాలికి కూడా ఈ ప్రభుత్వం పన్ను వేస్తుందని అన్నారు. టీడీపీ హయాంలో ప్రవేశ పెట్టిన అన్న క్యాంటీన్‌లు, పెళ్లి కానుకలు, విదేశీ విద్య, పండుగ కానుకలు, బెస్ట్ అవైల్‌బుల్ స్కూల్స్...ఇలా వంద రకాలకుపైగా పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని లోకేశ్ చెప్పారు.

వైసీపీ అవినీతి, అరాచక పాలనను అంతమొందించే సమయం ఆసన్నమైందని, ప్రతి ఒక్క కార్యకర్త రానున్న ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత అందరి సంగతి చూస్తామని వైసీపీ నేతలను ఉద్దేశించి హెచ్చరించారు.

ఈ సభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, అనకాపల్లి ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, సీనియర్ నాయకులు దాడి వీరభద్రరావు, ప్రగడ నాగేశ్వరరావు, కోట్ని బాలాజీ, దాడి రత్నాకర్, మాదంశెట్టి నీలబాబు, ఆడారి కిశోర్, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, అనకాపల్లి ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విశాఖ నుంచి అనకాపల్లి చేరుకున్న లోకేశ్‌కు టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు.

పేరులోనే ధర్మం... చేసేదంతా అధర్మం

... 5వ పేజీ తరువాయి

ఆరోపించారు. ఉద్యోగుల బదిలీల పోస్టింగుల్లో సైతం ముడుపులు వసూలు చేయడం ధర్మశ్రీకే చెల్లిందని, అతను తిరుగుతున్న కారు కూడా మైనింగ్ కంపెనీని బెదిరించి కొనిపించాడని ఆరోపించారు. మందు గుండు సామాన్లు అమ్మడానికి కూడా ధర్మశ్రీకి కప్పం కట్టాల్సిరావడం దుర్మార్గమన్నారు.

రోడ్లను బాగు చేసే బాధ్యత నాది

టీడీపీ పాలనలో రాష్ట్రంలోనే అత్యధికంగా చోడవరం నియోజకవర్గంలో 500 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేయించామని, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీలకు భవనాలు నిర్మించామని, వైసీపీ హయాంలో ఒక్క కిలోమీటరు కూడా సీసీ రోడ్డు వేయించలేదని అన్నారు. ఈ నియోజకవర్గంలో రోడ్లపై వారం రోజులు తిరిగితే ఆస్పత్రి పాలవడం ఖాయమన్నారు. టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో రోడ్లు బాగు చేయించే బాధ్యతను తాను తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు.

సుజల స్రవంతిని పూర్తిచేస్తాం

టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చిన తరువాత ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి, యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తామని, ఉత్తరాంధ్రలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. చోడవరం నియోజకవర్గంలో గొట్టివాడ, వాలాబు, చాకిపల్లిల్లో వంతెనల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు.

గోవాడ షుగర్స్‌లో ఇథనాల్ ప్లాంట్

టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో రూ.100 కోట్లతో ఇథనాల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి చెరకు రైతులను ఆదుకుంటామన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ ప్రకారం చెరకు టన్నుకు రూ.3,500 ఇవ్వడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. టీడీపీ, జనసేన కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కాగా సుమారు 35 నిమిషాలపాటు సాగిన లోకేశ్ ప్రసంగాన్ని సభకు వచ్చిన జనం చివరి వరకు ఆసక్తిగా విన్నారు. జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు.. లోకేశ్‌కు కత్తి, డాలు బహూకరించారు. టీడీపీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, ఇతర నేతలు జ్ఞాపికలను అందజేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, టీడీపీ నియోజకవర్గం పరిశీలకుడు మూర్తియాదవ్‌జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేటి శంఖారావం సభల వివరాలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 19: అనకాపల్లి జిల్లాలో మంగళవారం మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల్లో శంఖారావం సభలు జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు మాడుగుల నియోజకవర్గంలోని వడ్డాది- పాడేరు రోడ్డులో సభ ప్రారంభంకానున్నది. 10.36 గంటలకు లోకేశ్ ప్రసంగం, 10.56 గంటలతో పార్టీ శ్రేణులతో లోకేశ్ ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది. 11.26 గంటలకు పార్టీ శ్రేణులకు సూపర్ సిక్స్ కిట్లు పంపిణీ చేస్తారు. 1.10 గంటలకు లోకేశ్ నర్సీపట్నం నియోజకవర్గానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3.06 గంటలకు బలిఘట్టం సభలో లోకేశ్ ప్రసంగిస్తారు. 3.26 గంటలకు పార్టీ శ్రేణులతో ముఖాముఖి ఉంటుంది. అనంతరం సాయంత్రం 4 గంటలకు పాయకరావుపేట నియోజకవర్గానికి చేరుకుంటారు. కోటవురట్ల పోలీస్ స్టేషన్ దగ్గర నిర్వహించే సభలో సాయంత్రం 5.36 గంటలకు లోకేశ్ ప్రసంగిస్తారు. 6.30 గంటలకు రోడ్డు మార్గం గుండా ఆయన విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి 8.30 గంటలకు విమానంలో హైదరాబాద్ బయలుదేరతారు.

'జర్నలిస్టులపై వైసీపీ దాడులు అమానుషం'

అనకాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకులు దాడి చేయడం అమానుషమని ఇది వైసీపీ నిరంకుశ పాలనకు అద్దం పడుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. వైసీపీ ప్రభుత్వం రౌడీ పరిపాలన సాగిస్తున్నదని, గూండాలు రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం 'సిద్ధం' సభల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నదన్నారు.

రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ విజేత విజయనగరం



విజయనగరం జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మునగపాక, ఫిబ్రవరి 19 : రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీల విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. మండలంలోని నాగులాపల్లిలో జరుగుతున్న కబడ్డీ పోటీల్లో సోమవారం సెమీ ఫైనల్స్‌లో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, తూర్పు గోదావరి జట్లు తలపడగా విజయనగరం, శ్రీకాకుళం జట్లు ఫైనల్‌కు వచ్చాయి. ఇరుజట్లు ఫైనల్‌లో హోరాహోరీగా తలపడ్డాయి. శ్రీకాకుళంపై విజయనగరం జట్టు గెలుపొందింది. జనసేన పార్టీ నాయకుడు నాగబాబు క్రీడా పోటీలను తిలకించి, క్రీడాకారిణిలకు అభినందనలు తెలిపారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఎలమంచిలి టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు విజయనగరం జట్టుకు ప్రథమ, శ్రీకాకుళం జట్టుకు ద్వితీయ, తూర్పుగోదావరి జట్టుకు తృతీయ, విశాఖ జట్టుకు చతుర్థ బహుమతులను అందించారు. కాగా పురుషుల పోటీలో ఫైనల్‌లో అచ్యుతాపురం జట్టు గంగవరం జట్టుపై గెలుపొందింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, నాయకులు ధూళి రంగనాయకులు, మళ్ల రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు జనం సిద్ధం

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో జగన్‌రెడ్డి అరాచక పాలనతో విసుగు చెందిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలోనే మన్యం అభివృద్ధి జరిగిందంటున్న వైసీపీ నాయకులు, ఈ నాలుగున్నరేళ్లలో ఎక్కడ అభివృద్ధి చేశారో చర్చకు రావాలని సవాల్ విసిరారు. దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని, ప్రజల మధ్యలోనే ఎవరి పాలన స్వర్ణయుగమో? ఎవరి పాలన రాతి యుగమో? తేల్చేద్దామని పేర్కొన్నారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు వచ్చేందుకు జగన్‌రెడ్డికిగాని, పాడేరు నియోజకవర్గ వైసీపీ నాయకులకుగాని ఎవరికైనా దమ్ము ఉందా? అని ఆమె ప్రశ్నించారు. 2019లో ప్రజలు ఇచ్చిన ఒక్క ఛాన్సే జగన్‌రెడ్డికి రాజకీయంగా చివరి ఛాన్స్ అని గుర్తు చేశారు. ఎన్నికల సమయం ఆసన్న కావడంతో ఓటమి భయానికి గురైన సైకో జగన్, బదిలీల పేరుతో 77 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలను మడత పెట్టాడన్నారు. మిగిలిన వారిని మరో 50 రోజుల్లో రాష్ట్ర ప్రజలు మడత పెడతారని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు రూ.100 ఇచ్చి రూ.1000 దోచే జగన్, సంక్షేమం కోసం మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా జగన్‌రెడ్డి చేపట్టిన అరాచకాలు, విధ్వంసాలు మాత్రమే కనిపిస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గబ్బాడ సింహాచలం, కేవీ సురేష్‌కుమార్, బర్సింగి శ్రీనివాసరావు, కోడా కోటిబాబు, ఎ.రవి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే యువతకు ఉపాధి సాధ్యం

గిరిజన ప్రాంతంలో జీవో నంబరు 3 అమలు కావాలన్నా, గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలన్నా టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని పార్టీ నేత కొట్టగుల్లి సుబ్బారావు అన్నారు. మండలంలోని పాడేరు గొందూరు, కొత్త పాడేరు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో నంబరు 3ను అమలు చేసేందుకు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. సూపర్-6 పథకాలతో అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమం అందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించి చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మత్స్యరాస మణికుమారి, కొట్టగుల్లి ఉషారాణి, వి.పిన్నయ్యదొర, రంజిత్, చిట్టిబాబు, వసంతకుమారి, లక్ష్మణ్, అప్పారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఐదేళ్లుగా దళితులు కనిపించలేదా?

చింతపల్లి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ అంబేడ్కర్ కాలనీలోని దళితులు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి గుర్తుకొచ్చారా? ఐదేళ్లుగా వారి అవస్థలు కనిపించలేదా? అని టీడీపీ నేత రీమల ఝాన్సీ ప్రశ్నించారు. అంబేడ్కర్ కాలనీ దళితులతో కలిసి సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. ఐదేళ్లలో ఏనాడు ఈ కాలనీ వైపు కన్నెత్తి చూడని ఎమ్మెల్యేకు ఇప్పుడు దళితులు గుర్తుకురావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో స్థానిక దళితులు టీడీపీలో చేరారనే అక్కసుతో సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. అందుకే రెండు నెలల్లో ఎన్నికలు వస్తున్న సమయంలో ఇక్కడ డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారన్నారు. నాలుగో వార్డు ఉప ఎన్నికల్లో టీడీపీ బలపర్చిన అభ్యర్థి విజయంతోనే దళితులు ఏవైపు ఉన్నారో స్పష్టమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి వారంతా గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రీమల ఆనందరావు, చిన్న, సతీశ్, గిరి, రామకృష్ణ, పాంగి రాము పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసన

చింతపల్లి, ఫిబ్రవరి 19: రాప్తాడు సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడిపై చింతపల్లి ప్రెస్‌క్లబ్ విలేకరులు నిరసన తెలిపారు. మండల కేంద్రంలో భారీ ర్యాలీ చేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. శ్రీకృష్ణపై వైసీపీ నాయకులు దాడి చేయడం దారుణమని, దీన్ని అన్ని వర్గాల ప్రజలు ఖండిస్తున్నారని ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే చింతపల్లి గౌరవాధ్యక్షుడు దయానంద్ పేర్కొన్నారు. ఈ దాడికి పాల్పడిన వైసీపీ నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఎస్.వనరాజు, ప్రెస్ క్లబ్ నాయకులు గాంధీ, రాజు, రమణ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌పై మూకుమ్మడి దాడి అమానుషం

» భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజాబాబు



విలేకరులతో మాట్లాడుతున్న రాజాబాబు

చింతపల్లి, ఫిబ్రవరి 19: వార్తా సేకరణకు వైసీపీ సిద్ధం సభకు వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ఫొటో గ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడి అమానుషమని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజాబాబు అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాప్తాడులో జరిగిన సీఎం సిద్ధం సభను కవర్ చేసేందుకు వెళ్లిన ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ నాయకులు విచక్షణారహితంగా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దీన్ని భారత్ ఆదివాసీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులపై దాడులు చేయడం మంచి పని కాదన్నారు. ఏదైనా రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప పాత్రికేయులపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టాలు అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీకృష్ణపై దాడిచేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహణ అధ్యక్షుడు రామక్రిష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెల్లం శేఖర్ దొర పాల్గొన్నారు.

పీవీటీజీలకు ఉచిత విద్యుత్ మీటర్లు

» ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ సూర్యప్రతాప్

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 19: పీవీటీజీల గ్రామాల్లో ఉచిత విద్యుత్ మీటర్ల కల్పనకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ సూర్య ప్రతాప్ చెప్పారు. మండలంలో కంద్రుం పంచాయతీ పరిధిలోని లాసేరుగుడ, పనసపుట్టు, గొలంబో గ్రామాల్లో సోమవారం పర్యటించి, ఉచిత విద్యుత్ మీటర్ల కనెక్షన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జన్‌మన్ పథకంతో కేంద్ర ప్రభుత్వం పీవీటీజీలకు ఉచితంగా మీటర్లను ఇస్తున్నదన్నారు. ఇందుకోసం ఎవరికీ రూపాయ కూడా చెల్లించవద్దని సూచించారు. పాత ఇళ్ల లబ్ధిదారులకు కూడా మీటర్లను ఉచితంగా ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఈఈ రామక్రిష్ణ, ఈఈ కన్‌స్ట్రక్షన్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఈఈ సురేష్‌కుమార్, ఏఈ సత్యనారాయణ, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

రోడ్డా.. నల్ల కార్పెట్టా?

» తాడేపల్లి-రంప రహదారి నిర్మాణం ఘోరం

» లాగితేనే పెచ్చులుగా ఊడిపోతున్న వైనం

» కొరవడిన ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ

రంపచోడవరం, ఫిబ్రవరి 19: అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలం తాడేపల్లి నుంచి రంపచోడవరం మండలం రంప వరకు సుమారు 14 కిలోమీటర్ల మేర చేపడుతున్న తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించింది. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్ల కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ.4.32 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్టు తెలిసింది. రోడ్డు పనుల్లో నాణ్యత లోపించడంతో తారు పెచ్చులుగా ఊడిపోతోంది. రంపచోడవరం మండలం రంప నుంచి తాడేపల్లి వరకు వందలాది గ్రామాలను కలిపే ఈ రహదారి నిర్మాణం అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు తప్పవని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ రహదారి నిర్మాణంపై దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

వైసీపీ పాలనపై ప్రజాగ్రహం

» టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్



పాడేరులో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్

పాడేరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనపై ప్రజల ఆగ్రహం తీవ్రమైందని, రానున్న రోజుల్లో వైసీపీని ఇంటికి పంపడం ఖాయమని తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంట్ నియోజపకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఇక్కడ తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్‌తో అధికారంలోకి వచ్చిన జగన్, అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. దీంతో ప్రజలంతా జగన్ పాలనపై విసుగు చెందారని, టీడీపీ పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. అలాగే ప్రజలకు ఎటువంటి మేలు చేయకుండానే అన్నీ చేశామని జగన్, వైసీపీ నేతలు ప్రచారం చేయడం ఘోరమన్నారు. ప్రజలకు టీడీపీ చేసిన మేలు, వైసీపీ చేసిన అన్యాయంపై ఆ పార్టీ నేతలు చర్చకు వస్తారా? అని శ్రావణ్‌కుమార్ సవాల్ విసిరారు. అలాగే భవిష్యత్ ఏమిటో తెలిసి 77 మంది అభ్యర్థులను ఇతర ప్రాంతాల్లో పోటీకి దింపుతున్నారన్నారు. వైసీపీ పాలనలో అక్రమాలు, దోపిడీ, దౌర్జన్యాలు, విధ్వంసం, హింసలేగాని అభివృద్ధి, సంక్షేమం లేవన్నారు. అన్ని వర్గాలకు అన్యాయం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి బి.వెంకటరమణరాజు, టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి సుబ్బారావు, సర్పంచులు పాండురంగస్వామి, శశిభూషణ్‌నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అరకు ఇన్‌చార్జి దొన్నుదొర

బాబు సవాల్ స్వీకరించే ధైర్యం ఉందా?: దొన్నుదొర

హుకుంపేట: టీడీపీ అధినేత చంద్రబాబు సవాల్‌ను స్వీకరించే ధైర్యం సీఎం జగన్‌కు లేదని పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర స్పష్టం చేశారు. మండల కేంద్రమైన హుకుంపేటలో పార్టీ నేతలతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరిది అభివృద్ధి పాలనో.. ఎవరిది విధ్వంస పాలనో చర్చించేందుకు చంద్రబాబు విసిరిన సవాలకు ముందుకు వచ్చేంత ధైర్యం జగన్‌కు లేదన్నారు. అందుకే చంద్రబాబు సవాల్ విసిరి 24 గంటలైనా జగన్ నుంచి ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదన్నారు. స్వర్ణయుగం ఎవరిదో.. రాతి యుగమెవరిదో ప్రజలకు తెలియజేసే అవకాశం వచ్చినపుడు ఎందుకు వినియోగించుకోలేకపోతున్నారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన ఒక్క ఛాన్స్ రాజకీయ జీవితంలో జగన్‌కు ఆఖరి ఛాన్స్ అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో పాటి నేతలు నాగేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు

» ఆశ కార్యకర్తలుగా గుర్తించేవరకూ పోరాడతామని సుస్పష్టం

» ఐటీడీఏ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన

» ఐటీడీఏలోకి వెళ్లకుండా అడ్డుకుని అరెస్టు చేసిన పోలీసులు



ఐటీడీఏ ఎదురుగా రోడ్డుపై బైఠాయించిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు.. ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 19: సామాజిక ఆరోగ్య కార్యకర్త (సీహెచ్ డబ్ల్యూ)లు సోమవారం రోడ్డెక్కారు. ఆశ కార్యకర్తలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రభుత్వం స్పందించేవరకూ పోరాడతామని హెచ్చరించారు. అయితే పోలీసులు రంగ ప్రవేశం చేసి వారు ఐటీడీఏలోకి వెళ్లకుండా అడ్డుకుని అరెస్టు చేశారు.

సమస్యలపై సీహెచ్‌డబ్ల్యూలు సోమవారం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి ఐటీడీఏ వరకు భారీ ర్యాలీగా వచ్చారు. అనంతరం ఐటీడీఏ పీవోకు సమస్యలను వివరించేందుకు కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే వారిని పోలీసులు ప్రధాన గేటు వద్దే అడ్డుకున్నారు. దీంతో ఐటీడీఏ ఎదురుగా అరకు-పాడేరు ప్రధాన రహదారిలో వారంతా బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సీహెచ్‌డబ్ల్యూల వేతనం రూ.10 వేలకు పెంచాలని, ఆశలకు వర్తించే అన్ని సౌకర్యాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో ప్రజల ఆరోగ్య రక్షణకు కృషి చేసే సీహెచ్ డబ్ల్యూలపై ఐటీడీఏ అధికారులకు, ప్రభుత్వానికి చిన్నచూపు తగదన్నారు. ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న ముఖ్య నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.సుందరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బీ.పోతురాజు, ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూల యూనియన్ నాయకులు మంగమ్మ, పార్వతి, దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో కుర్చీ వేయరు.. కనీసం గౌరవించరు

సర్వసభ్య సమావేశంలో సర్పంచుల వేదన

అధికారులైనా గుర్తించాలని విన్నపం

ఐసీడీఎస్ పనితీరుపై జడ్పీటీసీ సభ్యుడి ధ్వజం







సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్‌బాబు... సమస్యలపై అధికారులను నిలదీస్తున్న సర్పంచులు

కొయ్యూరు, ఫిబ్రవరి 19: గ్రామాలలో గుర్తింపు లేదు.. సచివాలయాల్లో కూర్చొనేందుకు కుర్చీ లేదు.. కనీసం గౌరవం లేదు.. అని సర్పంచులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఛీ అంటే రావడం.. ఛీ అంటే పోవడం.. ఇలా కుక్కల మాదిరిగా తమ పదవులు తయారయ్యాయని వాపోయారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బడుగు రమేష్‌బాబు అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైస్ ఎంపీపీలతో పాటు ఎం.మాకవరం, బూదరాళ్ల, శరభన్నపాలెం, కొమ్మిక, కొయ్యూరు ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోగా, 33 పంచాయతీ సర్పంచులకు కేవలం తొమ్మిది మంది మాత్రమే వచ్చారు. కొండగోకిరి, చిట్టింపాడు సర్పంచులు ముసిలి నాయుడు, నూకాలమ్మ మాట్లాడుతూ సర్పంచ్‌లుగా బాధ్యతలు స్వీకరించి మూడేళ్లు పూర్తయినా సచివాలయ సిబ్బంది ఛీ.. అంటే రావడం, ఛీ.. అంటే పోవడం... ఇలా కుక్కల మాదిరిగా తమ పదవులు తయారయ్యాయని వాపోయారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో తాగునీటి బోర్లకు మరమ్మతులు సైతం చేయించలేని దౌర్భాగ్య స్థితి నెలకొందన్నారు. ఈ తరుణంలో తమను ఓట్లు వేసి గెలిపించిన ప్రజల కంట పడకుండా తిరగాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. బోర్ల రిపేర్లపై చెబుతున్నా పట్టించుకునేవారు లేరని, అధికారులైనా సర్పంచ్‌లుగా తమను గౌరవించాలని సర్వసభ్య సమావేశంలో వేడుకున్నారు. అనంతరం డౌనూరు ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు మాట్లాడుతూ ప్రతీ మండలంలో ఇప్పటికి మూడు దఫాలు ఎంపీటీసీ సభ్యులకు 15వ ఆర్థిక సంఘ నిధులు కేటాయించగా, ఈ మండలంలో ఒక్క దఫా మాత్రమే రూ.3 లక్షల వంతున ఇచ్చారని చెప్పారు. ఈ విషయమై ఎంపీపీ రమేష్‌బాబు స్పందిస్తూ ఉన్న నిధులు గ్రామాలలో ముఖ్యంగా తాగునీటి వసతి కల్పనకు వెచ్చించాలనే నిబంధన ఉందన్నారు. దీనికి అనుగుణంగా ఎంపీటీసీ సభ్యులు సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బందితో అంచనా వ్యయంపై ప్రతిపాదనలు తయారు చేయించి ఇస్తే నిధులు అందించడం జరుగుతుందని తెలిపారు. మరం భీమవరం పంచాయతీ పెదలంక గ్రామంలో ఏర్పాటు చేసిన జీపీఎస్ పాఠశాల నిర్వహణ తీరుపై పర్యవేక్షణ కొరవడడంతో ఉపాధ్యాయులు విధులకు హాజరుకావడం లేదని, దీనివల్ల విద్యార్థులు ఆకతాయిలుగా తయారవుతున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన వారికి కూలి చెల్లింపులు లేవని, పనిచేయని వారు డబ్బులు తీసుకుంటున్నారని, దీనిపై విచారణ చేయాలని సభ్యులు డిమాండ్ చేశాడు. గుజ్జుమానుపాకలు పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని, గోకిరిలో మూతపడిన ఎయిడెడ్ పాఠశాల స్థానంలో పాఠశాల ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కొండగోకిరి సర్పంచ్ కోరారు. అనంతరం అటవీ శాఖ తీరుపై డౌనూరు ఎంపీటీసీ విరుచుకుపడ్డారు. పదేళ్ల క్రితం అటవీ శాఖ సరఫరా చేసిన టేకు మొక్కలు, నేడు రైతు అవసరానికి వాడుకొనేందుకు నరికితే అటవీ శాఖ ఇబ్బందులు పెడుతూ లంచాలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు సభ నుంచి తీర్మానం చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ఇటీవల గురుకుల పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు జ్వరం బారిన పడ్డారని, ఇద్దరు తేరుకోగా మరో ముగ్గురు ఇంకా వైద్య సేవలు పొందుతున్నారని చెప్పారు. జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు ఐసీడీఎస్ పనితీరుపై ధ్వజమెత్తారు. కేంద్రాల్లో పౌష్టికాహారం నాణ్యత లేదని, గుడ్లు నిర్దేశించిన తూకం లేకుండా పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సీడీపీవో విజయలక్ష్మి స్పందిస్తూ నెలకు రెండు దఫాలు గుడ్లు సరఫరా జరుగుతుందన్నారు. తూకం నుంచి నాణ్యతపై ముందుగా పరిశీలన జరిపిన తరువాతే సరఫరా చేస్తున్నామని, ఇందులో ఏ విధమైన లోపాలు లేవన్నారు. అనంతరం మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చేతుల మీదుగా వలంటీర్లకు పురస్కాలు అందించారు. ఈ కార్యక్రమాలలో సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తపాడేరు ఆరోగ్య ఉప కేంద్రానికి జాతీయ స్థాయి గుర్తింపు



కొత్తపాడేరు ఆరోగ్య ఉప కేంద్రం వద్ద వైద్య సిబ్బంది

పాడేరు రూరల్, ఫిబ్రవరి 19: మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తపాడేరు ఆరోగ్య ఉప కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.గోపాలకృష్ణ తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు నెలలో జాతీయ నాణ్యత ప్రమాణాలు (ఎన్‌క్యాస్) బృందం పరిశీలన మేరకు కొత్తపాడేరు ఆరోగ్య ఉప కేంద్రం వచ్చారు. ఈ సందర్భంగా సౌకర్యాలు, వైద్య సేవలు, నిర్వహణ తీరుపై జాతీయ హెల్త్ మిషన్ అదనపు కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ ఎల్ఎస్.చాంగ్‌సన్ ప్రసంశాపత్రాన్ని జారీ చేశారన్నారు. అదే విధంగా సబ్ సెంటర్‌లో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటుకు రూ.1 లక్ష 26 వేలు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొత్తపాడేరు సబ్ సెంటర్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన సిబ్బంది సీహెచ్‌వో పి.దుర్గాభవాని, హెల్త్ అసిస్టెంట్ బి.ఎలీషారావు, ఏఎన్ఎం ఎం.విజయలక్ష్మి ఆశ కార్యకర్తలను ఆయన అభినందించారు. ప్రతిష్టాత్మకమైన ఎన్‌క్యాస్ సర్టిఫికేట్ పొందేందుకు సమకరించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ జమీల్ బాషా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ క్వాలిటీ కన్సల్టెంట్‌లు డాక్టర్ డి.రాకేష్, డాక్టర్ ఎంఎస్.లలిత, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న చలి తీవ్రత

» జీకే వీధిలో 11.1 డిగ్రీలు నమోదు

పాడేరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నప్పటికీ చలి తీవ్రత కొనసాగుతున్నది. పాడేరు, పరిసర ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా పొగమంచు కురవకపోయినప్పటికీ, ఇతర ప్రాంతాల్లో మాత్రం పొగమంచు తగ్గడం లేదు. అలాగే చలి సైతం విపరీతంగా ఉంటున్నది. మధ్యాహ్నం మినహా ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో చలి కొనసాగుతున్నది. కాగా జీకే వీధిలో 11.1, జి.మాడుగులలో 11.6, పాడేరులో 11.8, హుకుంపేటలో 12.5, ముంచంగిపుట్టులో 13.2, పెదబయలులో 13.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు సోమవారం నమోదయ్యాయి. శీతాకాలం ముగిస్తున్న తరుణంలో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు, కాస్త చలి అధికమవుతుందని పలువురు అంటున్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండల కేంద్రంలో సోమవారం 11.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచు అధికంగా కురవడంతో పాటు చలి ఉధృతి పెరిగింది. ఉదయం ఎనిమిది గంటల తరువాత మంచు వీడిపోతున్నది. ప్రస్తుతం గిరిజనులు చలి, మంచు వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



చింతపల్లి ప్రధాన రహదారిలో కురుస్తున్న మంచు

☛ సంక్షిప్తంగా..

నారా లోకేశ్‌ను కలిసిన రమేశ్‌నాయుడు



పాడేరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను స్థానిక టీడీపీ నేత కిల్లు వెంకటరమేశ్‌నాయుడు సోమవారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పటిష్టానికి, టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను లోకేశ్‌కు ఆయన వివరించారు.

గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా పర్యాటక సంస్థ అనుమతులు

» ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి



కాంతిలాల్‌దండేకు వినతి అందిస్తున్న రామలక్ష్మి

అరకులోయ, ఫిబ్రవరి 19: మన్యంలో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా పర్యాటక సంస్థ అనుమతులు మంజూరు చేసిందని ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి ఆరోపించారు. ఈ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండేకు అమరావతిలో సోమవారం వినతిపత్రం అందించారు. బొర్రా గుహలు వద్ద ప్రైవేటు వ్యక్తులకు జిప్‌లైనర్ అనుమతి ఇచ్చారన్నారు. అలాగే జన్‌మన్ పథకా నికి సంబంధించి పలువురు పీవీటీజీలకు తెలియకపోవడంతో పక్కా గృహాలకు సకాలంలో దరఖాస్తు చేసుకోలేకపోయారని చెప్పారు. మరోమారు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. వీటితో పాటు మరికొన్ని సమస్యలను ముఖ్య కార్యదర్శి దండే దృష్టికి తీసుకువెళ్లామని ఆమె వివరించారు.

మూఢ నమ్మకాల నివారణకు కమిటీ

పాడేరు రూరల్, ఫిబ్రవరి 19: జిల్లాలో మూఢ నమ్మకాల నివారణ కోసం సోమవారం నూతన కమిటీని ఎంపిక చేసినట్టు సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బైరి నరేష్ తెలిపారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడిగా వేణుగోపాల్, మహిళా గౌరవాధ్యక్షురాలుగా మేనక పూలే, అధ్యక్షుడిగా కిల్లో రాంబాబు, మహిళా అధ్యక్షురాలుగా మామిడి రాధాబాయ్, ప్రధాన కార్యదర్శిగా పల్లల ప్రసాదరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కిండంగి ఆనందరావు, ఉపాధ్యక్షుడిగా సింహాద్రినాయుడు, ప్రచార కార్యదర్శిగా సోమేష్, అధికార ప్రతినిధిగా ఎం.కొండబాబు, సంయుక్త కార్యదర్శిగా కె.చందు, సహాయ కార్యదర్శిగా పి.మత్స్యరాజు, కోశాధికారిగా ఝాన్సీరాణితో పాటు పలువురు సభ్యులను ఎంపిక చేసినట్టు చెప్పారు.

'ఆదివాసీల హక్కుల సాధనకు సీపీఎం అలుపెరగని పోరాటం'

చింతపల్లి, ఫిబ్రవరి 19: ఆదివాసీల హక్కుల సాధనకు అలుపెరగని పోరాటం చేస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. సోమవారం పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరి జనుల చట్టాలు, హక్కులను అధికార పార్టీలు ఉల్లంఘించి గిరిజన సంపదను దోచుకుంటున్నాయన్నారు. గిరి యువతకు ఉద్యోగాలు కల్పించే జీవో-3 పున రుద్ధరణకు వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా మైనింగ్ జరుగుతున్నదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యార్థులు మరణిస్తున్నారన్నారు. పోరాడే పార్టీలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. నాయకులు ధనుంజయ్, ఎ.బుజ్జిబాబు, మూర్తి, సూరిబాబు, సత్యనారాయణ, చంటిబాబు, బాలయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలుకు యూటీఎఫ్ నిరసన

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 19: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి సహకరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహేశ్వరరావు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని పార్టీల మండల అధ్యక్షులకు సోమవారం వినతిపత్రాలను అందజేసి నిరసన తెలిపారు. సీఎం జగన్ వివిధ సమావేశాల్లో 118 సార్లు ఓపీఎస్‌ను అమలు చేస్తానని చెప్పి, జీపీఎస్‌ను తీసుకొచ్చి ఉద్యోగుల మెడలో ఉరి తాడును బిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానం అమలయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కన్నయ్య, మండల కార్యదర్శి బాలక్రిష్ణ, నాయకులు మేఘనాథ్, సత్యనారాయణ, సీతన్న పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి గ్రామస్థుల సమక్షంలో భూమి పూజ చేస్తున్న వేద పండితులు

జి.మాడుగుల, ఫిబ్రవరి 19: సొలభం గ్రామంలో నీలకంఠ శివాలయం నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. భీమిలి సద్గురు సాయి సేవాశ్రమం, జి.మాడుగుల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త శ్రీసాయిరాంస్వామి ఈ కార్యక్రమం చేపట్టారు. 150 ఏళ్ల నాటి శివాలయ పునర్నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో నీటి సమస్య పరిష్కరించాలి

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 19: సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో నీటి సమస్యను పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కె.బలరాం డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి సీహెచ్‌సీని ఆయన సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ సీహెచ్‌సీలో నీటి సమస్య ఎక్కువగా ఉందని, నాలుగు రోజులుగా నీరు సరఫరా కాకపోవడంతో మరుగుదొడ్ల సదుపాయం లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలాగే తాగునీటి సమస్య కూడా ఎక్కువగా ఉందన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అతని వెంట వనభసింగి సర్పంచ్ వి.లక్ష్మణ్ ఉన్నారు.

పట్టాలు కోరుతూ నిరసన

కె.కోటపాడు, ఫిబ్రవరి 19: ఇనాం భూములకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ మండలంలోని గొండు పాలెం గ్రామస్థులు కె.కోటపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం సర్వే డీటీకి వినతిపత్రం అందజేశారు.